
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 22 మార్చి 2024





# నేటినుంచి ఐపీఎల్ క్రికెట్ పండుగ

- తొలి మ్యాచ్‌లో ఆర్సీబీతో తలపడనున్న సీఎస్కే
- ముస్తాబైన చెపాక్ మైదానం
- సాయంత్రం 6.30 నుంచి ప్రారంభోత్సవాలు



మ్యాచ్‌కు సిద్ధమైన చేపాక్కం స్టేడియం

పెరంబూర్, మార్చి 21: క్రికెట్ అభిమానులు ఎదురు చూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 17వ సీజన్ పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. చేపాక్కంలోని ఎంఏ చిదంబరం స్టేడియం తొలిమ్యాచ్‌కు వేదిక కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో తలపడనుంది. మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు ప్రారంభం కానుండగా, 6.30 నుంచే ప్రారంభ వేడుకలు అలరించనున్నాయి.

**ఈ సారి కొత్త కెప్టెన్‌తో సీఎస్కే..**

ఈసారి చెన్నై సూపర్‌కింగ్స్‌కు రుతురాజ్ గైక్వాడ్‌ను సారథిగా నియమించినట్లు ఆ జట్టు యాజమాన్యం ప్రకటించడంతో ధోనీ అభిమానులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. ధోని క్రేజ్ ఈ సారి కూడా ఐపీఎల్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. 16వ సీజన్ ఛాంపియన్‌గా నిలిచిన ధోని, 17వ సీజన్ తరువాత రిటైర్ అవుతా ర ని అందరూ భావిస్తున్నారు. ఇందుకు సంకేతమా అన్నట్లుగా సీఎస్కే యాజమాన్యం తమ జట్టు కెప్టెన్‌ను మార్చడం గమనార్హం.

**ముస్తాబైన చేపాక్కం...**

ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయాలు ఈనెల 18వ తేది ఆన్‌లైన్‌లో ప్రారంభమైన 10 నిమిషాల్లోనే ముగియడంతో అభిమానులు తీవ్ర నిరాశ చెందారు. మరోవైపు మ్యాచ్ కోసం స్టేడియం కొత్త సొగబులతో ముస్తాబైంది. స్టేడియం చుట్టూ చెన్నై సూపర్ కింగ్స్ జట్టు క్రీడాకారుల చిత్రాలు తీర్చిదిద్దగా, స్టేడియం మొత్తం పసుపు రంగుతో నిండిపోయింది. దేశవ్యాప్తంగా ఉన్న సీఎస్కే, ఆర్సీబీ అభిమానులు గురువారం సాయంత్రమే చెన్నైకి చేరుకున్నారు. ఇక, తమ తమ జట్ల జెర్సీల కొనుగోలుకు అభిమానులు పోటెత్తడంతో స్పోర్ట్స్ దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

**ప్రత్యేక కార్యక్రమాలు...**

ఐపీఎల్ తొలి మ్యాచ్ సందర్భంగా సాయంత్రం 6.30 గంటల నుంచి ప్రారంభం కానున్న వేడుకల్లో ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహ్మాన్ సంగీత కచ్చేరి, బాలీవుడ్ నటుల నృత్య ప్రదర్శనలతో పాటు రాష్ట్రానికి చెందిన సంప్రదాయ కళా ప్రదర్శనలు చోటుచేసుకోనున్నాయి. ఐపీఎల్ మ్యాచ్ టిక్కెట్లు పొందిన అభిమానులు మెట్రోరైళ్లు, ఎంటీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ఆయా సంస్థలు ప్రకటించాయి. ఇక, మ్యాచ్ జరగనున్న స్టేడియం చుట్టూ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటైంది. స్టేడియం చుట్టుపక్కల ఉన్న ప్రధాన జంక్షన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతా చర్యలను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ఇక, మ్యాచ్ ముగిసిన అనంతరం అభిమానులు తమతమ ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంటీసీ సంస్థ ప్రత్యేక బస్సులు నడపనుండగా, చింతాద్రిపేట నుంచి వేళచ్చేరి వరకు ప్రత్యేక సబర్బన్ రైలు నడపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది.



అరివాలయంలో స్టాలిన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కరుణాస్

## డీఎంకే కూటమికి కరుణాస్ పార్టీ మద్దతు

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమికి మద్దతు ఇస్తున్నట్లు ముక్కులత్తోర్ పులిపడై అధ్యక్షుడు, తమిళ సినీ హాస్య నటుడు కరుణాస్ ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఉదయం అన్నా అరివాలయంలో డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్‌ను కలుసుకున్నారు. స్టాలిన్‌ను శాలువతో సత్కరించి, ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమిని గెలిపించేందుకు తమ పార్టీ పాటుపడుతుందని హామీ ఇచ్చారు. ఇదే విధంగా దేవేంద్ర కుల మక్కల్ మున్నేట్ర పేరవై అధ్యక్షుడు ఎస్.ఆర్. పాండ్యన్, అఖిల ఇండియ మక్కల్ మరుమలర్చి కళగం నేత పొన్ మురుగేశన్ కూడా స్టాలిన్‌ను కలుసుకుని డీఎంకే కూటమికి మద్దతు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. తమిళ మానిల దేశీయ లీగ్ పార్టీ ప్రధాన కార్యదర్శి తిరుప్పూరు అల్తాఫ్ కూడా స్టాలిన్‌ను కలుసుకున్నారు. డీఎంకే కూటమి అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేయనున్నట్టు ప్రకటించారు. దర్మపురి డీఎంకే అభ్యర్థి ఎ. మణి, తంజావూరు అభ్యర్థి మురసొలి కూడా అరివాలయంలో స్టాలిన్‌ను కలుసుకుని ఆశీస్సులందుకున్నారు.

## బీజేపీ ప్రజా వ్యతిరేక పథకానికి ఈపీఎస్ మద్దతు పలికారు

- తూత్తుకుడిలో కనిమొళి



కనిమొళిని గజమాలతో సత్కరిస్తున్న డీఎంకే మహిళా విభాగం కార్యకర్తలు

ప్యారీస్, మార్చి 21: బీజేపీ ప్రజా వ్యతిరేక పథకానికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మద్దతిచ్చిన విషయం ప్రజలు మరచిపోలేదని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. తూత్తుకుడి లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం గురువారం ఆమె చెన్నై నుంచి విమానం ద్వారా తూత్తుకుడికి చేరుకున్నారు. ఆమెకు పార్టీ జిల్లా కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, డీఎంకే నిర్వాహకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కనిమొళి మీడియాతో మాట్లాడుతూ... తూత్తుకుడి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు మళ్లీ డీఎంకే అధిష్ఠానం ఇక్కడే పోటీ చేసేందుకు అవకాశం కల్పించిందని తెలిపారు. విలాత్తికుళం వరకు తాగునీటి కొరత తీర్చేందుకు 363 గ్రామాలు అనుసంధానం చేసే పథకం పనులు ప్రస్తుతం పూర్తయ్యే దశలో ఉన్నాయని, అదే విధంగా తిరుచెందూర్, సాత్తాన్‌కుళం తదితర ప్రాంతాల ప్రజలకు కూడా తాగునీటిని సరఫరా చేసేలా రూపొందించిన మెగా పథకానికి అనుమతులు జారీ అయ్యాయన్నారు.

## 32 నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే పోటీ

- రెండో విడత అభ్యర్థుల జాబితా విడుదల
- విజయకాంత్ సమాధివద్ద ఈపీఎస్ నివాళి

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే 32 నియోజకవర్గాల్లో పోటీ చేయనుంది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) 16 మంది అభ్యర్థులతో రెండో విడత జాబితాను గురువారం ఉదయం విడుదల చేశారు. అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకేకి ఐదు నియోజకవర్గాలు, పుదియ తమిళగం, ఎస్డీపీఐలకు తలా ఒక సీటు కేటాయించారు. ఈ సందర్భంగా ఈపీఎస్ విలేకరులతో మాట్లాడుతూ... డీఎంకే అసమర్థ పాలనపై ఆగ్రహంగా ఉన్న ప్రజలంతా తమ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. విలవంగోడు అసెంబ్లీ ఉపఎన్నికల్లో పార్టీ తరఫున రాణి పోటీ చేస్తారని ఆయన తెలిపారు. ఇక డీఎంకేని విమర్శిస్తున్నంతగా బీజేపీని విమర్శించడం లేదే అని విలేకరులు అడిగిన ప్రశ్నకు వేచి చూడండి అంటూ బదులిచ్చారు. డీఎంకే వెలువరించిన మేనిఫెస్టో అబద్ధాల పుట్ట అని, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 500కు పైగా హామీలిచ్చి నాలుగైదు మాత్రమే నెరవేర్చిందన్నారు. అన్నాడీఎంకే అభ్యర్థుల జాబితాలో ఒక మహిళకు మాత్రమే పోటీ చేయడానికి అవకాశమిచ్చామని, అంతమాత్రానికే మహిళలకు తమ పార్టీ వ్యతిరేకమని భావించకూడదని, గెలుపునకు అవకాశం కలిగిన అభ్యర్థులనే పోటీకి దింపుతున్నామని చెప్పారు.

**విజయకాంత్‌కు నివాళి...**

జాబితాను విడుదల చేసిన తర్వాత ఈపీఎస్ కోయంబేడులోని డీఎండీకే కార్యాలయానికి వెళ్లారు. ఆయనతోపాటు సీనియర్ నేతలు డి. జయకుమార్, పొన్నయ్యన్, కే.పీ.మునుసామి, పొల్లాచ్చి జయరామన్, తంగమణి తదితరులున్నారు. డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, ఆమె సోదరుడు సుదీష్ తదితరులు ఈపీఎస్ బృందానికి స్వాగతం పలికారు. ఆ తర్వాత విజయకాంత్ సమాధి ప్రాంతం వద్ద ఈపీఎస్, అన్నాడీఎంకే నేతలు పుష్పాంజలి ఘటించారు. కార్యాలయంలో ఎంజీఆర్, జయలలిత, విజయకాంత్ ఫొటోలను ఆయన ఆసక్తిగా తిలకించారు. ఆ తర్వాత ప్రేమలత, ఈపీఎస్, రెండు పార్టీల ప్రతినిధులు కాసేపు సమావేశమై చర్చలు జరిపారు. ఆ సందర్భంగా ఈనెల 24న తిరుచ్చిలో తాను పాల్గొననున్న బహిరంగ సభకు ప్రేమలతను ఆహ్వానించారు. తిరుచ్చి సభకు తప్పకుండా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు పాల్గొంటానని ఆమె హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఈపీఎస్, అన్నాడీఎంకే నేతలు అక్కడి నుండి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రేమలత విలేకరులతో మాట్లాడుతూ... తమ పార్టీ కార్యాలయానికి ఈపీఎస్ రాకతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం అధికమైందన్నారు. తాజాగా ఈపీఎస్‌తో జరిపిన చర్చలు తమ పార్టీకి రాజ్యసభ సీటు లభిస్తుందనే నమ్మకం కలుగుతోందన్నారు.



డీఎండీకే కార్యాలయం వద్ద విజయకాంత్ సమాధికి ఈపీఎస్ పుష్పాంజలి

**రెండో జాబితాలో అన్నాడీఎంకే అభ్యర్థులు...**

శ్రీపెరుంబుదూరు - ప్రేమ్‌కుమార్, ధర్మపురి - అశోకన్, కళ్లకురిచ్చి - కుమారగురు, వేలూరు - పశుపతి, తిరువణ్ణామలై - కలియపెరుమాళ్, కోయంబత్తూరు - రామచంద్రన్, తిరుచ్చి - కరుప్పయ్యా, పెరంబలూరు - చంద్రమోహన్, తిరుప్పూరు - అరుణాచలం, నీలగిరి (రిజర్వుడు) - లోకేష్, మైలాడుదురై - బాబు, తిరునల్వేలి - సిమ్లా ముత్తుచోళన్, శివగంగ - జేవియర్ దాస్, తూత్తుకుడి - శివసామి వేలుమణి, కన్నియాకుమారి - పసిలియా నజరేత్, పుదుచ్చేరి - తమిళవేందన్.

## అభ్యర్థికోసం 4 నెలలుగా బీజేపీ వెదుకులాట!

- పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి ఎద్దేవా



చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీకి దింపేందుకు బీజేపీ నాలుగు నెలలుగా అభ్యర్థి కోసం ముమ్మరంగా వెదుకుతోందని, అయినా ఇప్పటి దాకా వారికి చిక్కలేదని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి ఎద్దేవా చేశారు. పుదుచ్చేరిలో డీఎంకే కూటమి నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఆ సమావేశంలో నారాయణస్వామి పాల్గొని ఎన్నికల ప్రచార వ్యూహంపై చర్చించారు. అటు పిమ్మట విలేకరులతో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్నార్ కాంగ్రెస్ - బీజేపీ కూటమి ప్రభుత్వ అసమర్థపాలనపై ప్రజలంతా విసిగిపోయారని, లోక్‌సభ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను రాష్ట్రం నుంచితరిమికొట్టేందుకు సిద్ధపడుతున్నారని తెలిపారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ కూటమి పాలన ఉండటం రాష్ట్రం బాగా అభివృద్ధి చెందుతుందని ఎన్నార్ కాంగ్రెస్, బీజేపీ నేతలు గొప్పలు చెప్పుకున్నారని, మూడేళ్లకు పైగా రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందన్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమి కలిసికట్టుగా పాటుపడితే బీజేపీ, ఎన్నార్ కాంగ్రెస్‌లను చిత్తుగా ఓడించవచ్చనని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ దక్షిణాది రాష్ట్రాలలో పార్టీ ఓటమిని అడ్డుకునేందుకే తరచూ పర్యటిస్తున్నారని, ప్రతిసభలోనూ ఆయన పదే పదే చెబుతున్న అబద్ధాలను చూసి జనం పగలబడి నవ్వుకుంటున్నారని నారాయణస్వామి అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వ పతనం కావటం తథ్యమన్నారు.

## సౌత్ చెన్నైలో తమిళిసై... కోవైలో అన్నామలై!

**9మందితో బీజేపీ తొలి జాబితా**




ప్యారీస్, మార్చి 21: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి బీజేపీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ గురువారం సాయంత్రం విడుదల చేసింది. ఆ జాబితా ప్రకారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వాణిజ్య నగరం కోయంబత్తూరులో, మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌత్ చెన్నైలో, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ నీలగిరి (రిజర్వుడు) నియోజకవర్గంలో, కేంద్ర మాజీ మంత్రి పొన్.రాధాకృష్ణన్ కన్నియాకుమారిలో పోటీ చేయనున్నారు. ఇదే విధంగా బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ తిరునెల్వేలి నియోజకవర్గంలో, పెరంబలూరులో ఎస్ఆర్ఎం విద్యా సంస్థల అధినేత డాక్టర్ పారివేందర్, సెంట్రల్ చెన్నైలో వినోద్ పి.సెల్వం, వేలూరులో న్యూజస్టిస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ఏసీ షణ్ముగం, కృష్ణగిరిలో సి.నరసింహన్, నీలగిరి రిజర్వుడు నియోజకవర్గంలో డీఎంకే సిట్టింగ్ ఎంపీ ఎ.రాజాతో కేంద్రమంత్రి ఎల్.మురుగన్ తలపడనున్నారు. ఇక సౌత్ చెన్నైలో డీఎంకే తరఫున పోటీ చేయనున్న తమిళచ్చి తంగపాండ్యన్‌తో డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ఢీకొంటారు. పెరంబలూరులో ఐజేకే వ్యవస్థాపకుడు పారివేందర్ కమలం గుర్తుపై పోటీ చేస్తారని బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ ప్రకటించింది. తొలుత ఈ జాబితాలో డీఎంకే ఎంపీ కనిమొళి పోటీ చేస్తున్న తూత్తుకుడిలో నయినార్ నాగేంద్రన్ పోటీ చేస్తారని పేర్కొన్నారు. కాసేపటికల్లా అభ్యర్థుల జాబితాలో స్వల్ప మార్పు అంటూ మరో జాబితాను బీజేపీ కేంద్ర కమిటీ విడుదల చేసింది. ఆ జాబితా ప్రకారం నయినార్ నాగేంద్రన్ తూత్తుకుడిలో కాకుండా తిరునెల్వేలిలో పోటీ చేస్తారని పేర్కొన్నారు.

## తమిళనాడు - కేరళ సరిహద్దుల్లో ముమ్మర తనిఖీలు



కోవై సమీపం కేరళ సరిహద్దు వద్ద చెక్‌పోస్టులో తనిఖీలు

అడయార్, మార్చి 21: లోక్‌సభ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కోయంబత్తూరులోని తమిళనాడు - కేరళ సరిహద్దుల్లో ఏకంగా 14 సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. అలాగే, సరిహద్దు ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేశారు. ఓటర్లకు నగదు, బహుమతులు బట్వాడా కాకుండా అడ్డుకునే చర్యల్లో భాగంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులోభాగంగా ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఇదే విషయంపై ఇరు రాష్ట్రాల అధికారుల సమాలోచన సమావేశం కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఇందులో కలెక్టర్ క్రాంతికుమార్, త్రిస్సూర్ కలెక్టర్ కృష్ణన్ తేజ తదితరులు పాల్గొన్నారు.

## 2నుంచి పరీక్షలు

- 1-9 తరగతి విద్యార్థులకు 13 నుంచి వేసవి సెలవులు

అడయార్, మార్చి 21: రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఏప్రిల్ 2నుంచి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలు ముగిసిన తర్వాత ఏప్రిల్ 13వ తేదీ నుంచి వేసవి సెలువులు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు కన్నప్పన్ వెల్లడించారు. ఉపాధ్యాయులు మాత్రం ఏప్రిల్ 19న రాష్ట్రంలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం ఇచ్చే శిక్షణలో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 23వ తేదీ నుంచి 26వరకు 1 నుంచి 9వ తేదీ వరకు వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకన జరుగుతుందని పేర్కొన్నారు. ఈ యేడాది విద్యా సంవత్సరానికిగాను ఏప్రిల్ 26వ తేదీని చివరి పనిదినంగా నిర్ణయించినట్టు తెలిపారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి పునఃప్రారంభమయ్యే తేదీని తర్వాత వెల్లడిస్తామని ప్రకటించారు.

**రెండు పూటలా వార్షిక పరీక్షలు**

కాగా, ఒకటి నుంచి 9వ తేదీ వరకు జరిగే వార్షిక పరీక్షలను ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు తెలిపారు. 1 నుంచి 4వ తరగతి వరకు ఏప్రిల్ 2వ తేదీ లాంగ్వేజ్, 3న ఇంగ్లీష్, 5న గణితం, 8న మైనార్టీ లాంగ్వేజ్, 10న సైన్స్, 12న సోషల్ సైన్స్ పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అలాగే, 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఏప్రిల్ 2న ఉదయం లాంగ్వేజ్ పరీక్ష, 3న ఆంగ్లం, 4వ తేదీ మధ్యాహ్నం ఫిజికల్ సైన్స్, 5వ తేదీ ఉదయం గణితం, 8న మధ్యాహ్నం మైనార్టీ లాంగ్వేజ్, 10న ఉదయం సైన్స్, 12వ తేదీ ఉదయం సోషల్ సైన్స్ పరీక్షలు నిర్వహిస్తారు.

**రంజాన్ వేళలు**

శుక్రవారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.26
శనివారం : సహర్ : ఉదయం - 4.31



## నేత్రపర్వంగా తిరువారూర్ త్యాగరాజ స్వామి రథోత్సవం



ప్యారీస్, మార్చి 21: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరువారూర్ త్యాగరాజ స్వామి ఆలయంలో గురువారం ఉదయం నేత్రపర్వంగా సాగిన ఆలి రథోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రథం లాగి మొక్కులు తీర్చుకున్నారు. సంగీత ముమ్మూర్తులలో ఒకరైన త్యాగరాజ స్వామి ఆలయం ఆధ్యాత్మికంగానే కాకుండా, సంగీతంలో కూడా రాణించడం ద్వారా ప్రపంచ దేశాలకు త్యాగయ్య కీర్తి వ్యాపించింది. ఈ ఆలయానికి మరింత ఘనత చేకూర్చేలా యేటా నిర్వహించే ఆలి రథోత్సవంలో లక్షలాది మంది భక్తులు పాల్గొనడం విశేషం. ఆసియా ఖండంలోనే అతిపెద్ద రథంగా తిరువారూర్ త్యాగరాజస్వామి ఆలయ రథం గుర్తింపు పొందింది. ప్రస్తుతం పంగుణి ఉత్తిరై వేడుకల్లో ప్రధానాంశంగా 96 అడుగుల ఎత్తులో అద్భుతమైన కళాఖండాలతో రూపొందించిన రథం బరువు 300 టన్నులు. తిరుచ్చిలోని బెల్ సంస్థ ద్వారా నాలుగు ఇనుప చక్రాల్లో హైడ్రాలిక్ బ్రేక్ సిస్టమ్ పొందుపరిచారు. రథం పైభాగంలో 4 అంతస్తుల్లో వెదురు, టేకు కలప వినియోగించారు. రథాన్ని రకరకాల పుష్పాలు, పండ్లు, తోరణాలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. గురువారం ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ అనంతరం ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారం నుంచి భక్తుల దివ్యనామస్మరణ, వేదపండితుల మంత్రోచ్ఛరణ, మేళతాళాల మధ్య రథం కదిలింది. ఈ రథంతో పాటు వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, అంబాళ్, చండీకేశ్వర రథాలను కూడా భక్తులు లాగి పరవశించిపోయారు. మండుతున్న ఎండల్లో కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో సుమారు 2,000 మందికి పైగా పోలీసులు భద్రతా విధులు నిర్వహించారు.

## సమాచార ధ్వని

### నేడు ఐపీఎల్ పోటీల ప్రారంభం
### నగరంలో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, మార్చి 21: స్థానిక చేపాక్కంలో ఈ నెల 22, 26 తేదీల్లో జరగనున్న ఐపీఎల్ టీ20- క్రికెట్ పోటీల సందర్భంగా స్టేడియం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మార్పులు అమలులో ఉంటాయని ట్రాఫిక్ విభాగం పోలీసులు తెలిపారు.

- భారతి రోడ్డు నుంచి విక్టోరియా హాస్టల్ రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు వాలాజా రోడ్డు నుంచి వెళ్లాలి.
- భారతి రోడ్డు - బెల్స్ రోడ్డు జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు వాలాజా రోడ్డు నుంచి వెళ్లాలి.
- కన్నగి విగ్రహం నుంచి వచ్చే ప్రభుత్వ బస్సులు బెల్స్ రోడ్డుకు బదులుగా రత్న కేఫ్ జంక్షన్, ట్రిప్లికేన్ హైరోడ్డు మీదుగా వెళ్లాలి.
- రత్న కేఫ్ జంక్షన్ నుంచి వాహనాలు భారతి రోడ్డు - బెల్స్ రోడ్డు - వాలాజా రోడ్డు మీదుగా వెళ్లాలి.
- భారతి రోడ్డు - బెల్స్ రోడ్డు జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు కణ్ణగి రోడ్డు మీదుగా వెళ్లేందుకు అనుమతి లేదు.

**పార్కింగ్ ప్రదేశాలు...**

- అనుమతి కార్డులు పొందిన వాహనాలు మాత్రమే వాలాజా రోడ్డు, శ్రామికుల విగ్రహం, కామరాజర్ రోడ్డు, కన్నగి విగ్రహం, భారతి రోడ్డు మీదుగా విక్టోరియా రోడ్డుకు వెళ్లి పార్కింగ్ చేయాలి.
- అనుమతి కార్డులు లేని వాహనాలు వాలాజా రోడ్డు, కామరాజర్ రోడ్డు మీదుగా వెళ్లి ప్రజాపనుల శాఖ కార్యాలయం ఎదుట ఉన్న స్థలంలో పార్కింగ్ చేయాలి.
- యుద్ధ స్మారక విగ్రహం, గాంధీ విగ్రహం నుంచి వచ్చే వాహనాలు ప్రజాపనుల శాఖ కార్యాలయం ఎదుట ఉన్న సముద్రతీర లింక్ రోడ్డులో పార్కింగ్ చేయాలి.

### నేటితో ముగియనున్న ప్లస్‌టూ పరీక్షలు

ఐసిఎఫ్, మార్చి 21: ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు శుక్రవారంతో ముగియనున్నాయి. రాష్ట్ర పాఠశాల విద్యా పాఠ్య ప్రణాళికలో ప్లస్‌టూ పరీక్షలు ఈనెల 1వ తేదీన ప్రారంభమైన విషయం విదితమే. వీరికి ఆఖరి పరీక్ష ఈనెల 22న శుక్రవారం జరుగనుంది. బయాలజీ, బోటనీ, హిస్టరీ, బిజినెస్, మ్యాథ్స్ వృత్తి విద్యా ఇంజనీ రింగ్ పాఠ్యాంశాలు, ఆఫీస్ మేనేజ్‌మెంట్ వంటి సబ్జెక్టు లకు పరీక్షలు జరగనున్నాయి. జవాబు పత్రాల మూల్యాంకన ఏప్రిల్ 1 నుంచి 13వ తేదీ వరకు జరగనుంది. మే 8న ఫలితాలు విడుదల కానున్నాయి.

### కొత్త రేషన్‌కార్డు పంపిణీ నిలిపివేత

ఐసిఎఫ్, మార్చి 21: కొత్త రేషన్ కార్డు పంపిణీని ఆహార సరఫరా శాఖ నిలిపివేసింది. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 19న జరగనున్నాయి. ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తాత్కాలికంగా పంపిణీ నిలిపివేశామని ఆహార సరఫరా శాఖ కమిషనర్ తెలిపారు.

### గ్రూప్ 2 పోస్టులకు ఇంటర్వ్యూలు

ఐసిఎఫ్, మార్చి 21: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా వున్న గ్రూప్ 2 పోస్టుల భర్తీకి మూడో విడత ఇంటర్వ్యూల వివరాలను టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. ఔత్సాహికులు తమ స్వీయ వివరాలు మూడు రోజుల్లో నమోదు చేసుకోవాలని, అనంతరం ఇంటర్వ్యూలో పాల్గొనేందుకు కాల్ లెటర్ పంపుతామని, ఇంటర్వ్యూ మార్కులు, ర్యాంకు వివరాలు ఏప్రిల్‌లో విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

### పెరిగిన థర్మల్ విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, మార్చి 21: రాష్ట్ర విద్యుత్ బోర్డు థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి సామర్థ్యం 5,120 మెగావాట్లకు పెంచింది. విద్యుత్ బోర్డుకు 4320 మెగావాట్ల సామర్థ్యంతో థర్మల్ విద్యుత్ కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటిల్లో తూత్తుకుడి - 1050, సేలం జిల్లా మేట్టూరు 840, మేట్టూరు విస్తరణ 600, ఉత్తర చెన్నై 680, ఉత్తర చెన్నై విస్తరణ 1200, ఉత్తర చెన్నై3 800 చొప్పున మొత్తం 5,120 మెగావాట్ల మేరకు ఉత్పత్తి పెంచినట్లు అధికారులు తెలిపారు.

### దూరవిద్యా కోర్సుల నిర్వహణపై నిషేధం

ఐసిఎఫ్, మార్చి 21: సేలం పెరియార్ సహా వివిధ రాష్ట్రాల్లోని మూడు విశ్వవిద్యాలయాల్లో దూర విద్యాకోర్సుల నిర్వహణపై యూజీసీ నిషేధించింది. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో దూరవిద్య ఆన్‌లైన్ కోర్సులందించేందుకు 2020లో యూజీసీ ఆధ్వర్యంలో కొత్త క్రమశిక్షణ విధానాలు అమల్లోకి వచ్చాయి. వాటి ప్రకారమే దూరవిద్యాకోర్సులు నిర్వహించాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా వున్న పెరియార్ యూనివర్శిటీలో దూరవిద్యా కోర్సు నిర్వహణను నిలిపేస్తున్నట్లు యూజీసీ ప్రకటించింది.

### వ్యక్తిగత పూచీకత్తు లేకుండా దివ్యాంగులకు రుణాలు

ఐసిఎఫ్, మార్చి 21: రుణాలు పొందడంలో వ్యక్తిగత పూచీకత్తును సమకూర్చడం నుంచి దివ్యాంగులకు మినహాయింపు లభించింది. సహకారశాఖ ఆధ్వర్యంలో పనిచేసే సహకార బ్యాంకుల్ని ప్రత్యేక రాయితీతో దివ్యాంగులు వృత్తులు ప్రారంభించేందుకు రుణాలు అందిస్తున్నారు.వారు నిర్ణీతసమయంలో రుణాలు తిరిగి చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తున్నారు. ప్రస్తుతం రూ.50 వేల వరకు వ్యక్తిగత రుణానికి ఒకరు పూచీకత్తు ఇవ్వాలి. రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు ఇద్దరు పూచీకత్తు ఇవ్వాల్సివుంది. పూచీకత్తు ఇచ్చేందుకు పలువురు ముందుకు రాకపోవడంతో పూచీకత్తు లేకుండానే రుణాలు ఇవ్వాలని ప్రభుత్వానికి దివ్యాంగులు విజ్ఞప్తి చేశారు. దీన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం వ్యక్తిగత పూచీకత్తును సమకూర్చుకోవడం నుంచి దివ్యాంగులకు మినహాయింపునిచ్చింది.

### పెరిగిన ఎం-శాండ్ ధర

ఐసిఎఫ్, మార్చి 21: ఎం-శాండ్ ధర పెరిగింది. పుదుకోట జిల్లా వివిధ ప్రాంతాల్లో కావేరి నది ఇసుక రీచ్ మూతపడడంతో ఏర్పడిన కొరతతో కొత్త గృహాలు నిర్మించేందుకు ఎం-శాండ్, బి-శాండ్‌ను ఆశ్రయిస్తుండడంతో ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం 3 యూనిట్ల ఎం-శాండ్ రూ.15,000 విక్రయమవుతోంది. దీంతో ఒక గృహాన్ని నిర్మించేందుకు నిర్ణయించిన పైకం కంటే 10 నుంచి 15 శాతం వరకు అదనంగా వ్యయం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

### చెన్నై - గురువాయూర్ రైలు సేవల్లో మార్పులు

ఐసిఎఫ్, మార్చి 21: చెన్నై ఎగ్మూర్ - గురువాయూర్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవల్లో మార్పులు జరిగాయి. ఈ రైలు ఈనెల 27 నుంచి జూన్ 24వ తేది వరకు నాగర్‌కోయిల్ వెళ్లకుండా, నాగర్‌కోయిల్ టౌన్ మీదుగా నడపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. నాగర్‌కోయిల్ - కన్నియాకుమారి మధ్య చేపడుతున్న డబ్లింగ్ పనుల నిమిత్తం దారి మళ్లించారు.

### వ్యక్తులుంటేనే బస్సుల్లో పార్శిళ్ల అనుమతి

ఐసిఎఫ్, మార్చి 21: ప్రభుత్వ బస్సుల్లో వ్యక్తులుంటేనే పార్శిల్ పంపేందుకు అనుమతించనున్నారు. ప్రభుత్వ బస్సుల్లో కండక్టర్‌కు రుసుము చెల్లించి పార్శిళ్లు పంపే అనుమతిని ప్రైవేటు సంస్థలు పొందాయి. కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ బస్సుల్లో నగదు బట్వాడాను అడ్డుకొనేందుకు చర్యలు చేపట్టాలని రవాణా సంస్థలకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ బస్సుల్లో వ్యక్తులు లేకుండా పార్శిల్ పంపరాదని రవాణా సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది.

## వడపళని మురుగన్ ఆలయంలో పంగుణి ఉత్తిర వేడుకలు ప్రారంభం

ప్యారీస్, మార్చి 21: స్థానిక వడపళని మురుగన్ ఆలయంలో పంగుణి ఉత్తిర వేడుకలు లక్షార్చనతో గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈనెల 27వ తేది వరకు ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణిలో తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అదే విధంగా 23వ తేది సాయంత్రం వరకు వళ్లీదేవసేన సమేత మురుగన్ పెరుమాళ్‌కు లక్షార్చన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. పంగుణి ఉత్తిరై వేడుకల కోసం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక యాగశాలను ఏర్పాటు చేశారు. వేడుకల్లో ప్రధానాంశం 24వ తేది పంగుణి ఉత్తిర పర్వదినం సందర్భంగా స్వామివార్లకు తీర్థవారి, కలశాభిషేకం, క్షీరాభిషేకం, 9 రకాల అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆ రోజు రాత్రి 7 గంటలకు ప్రత్యేక అలంకారంతో ఉత్సవమూర్తుల ఊరేగింపు జరుగుతుంది. ఈ నెల 27వ తేది వరకు ఆలయం, పరిసర ప్రాంతాలు, వడపళనిలోని పలు వీధుల్లో చలువ పందిళ్లు ఏర్పాటుచేసి మజ్జిగ, నీరు తదితరాలు పంపిణీ చేయనున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయం ముందు క్యూలైన్లు ఏర్పాటు చేశారు.


ఉత్సవమూర్తులకు హారతి పూజ

## ప్రధానిని చూడాలనే ఆసక్తితోనే...

- రోడ్ షోలో విద్యార్థులు పాల్గొనడంపై బీజేపీ వివరణ


కోవై ప్రధాని రోడ్ షోలో పాల్గొన్న విద్యార్థులు

పెరంబూర్, మార్చి 21: మోదీని చూడాలనే ఆసక్తితోనే విద్యార్థులు స్వచ్ఛందంగా రోడ్‌షోలో పాల్గొన్నారని, ఇందులో పార్టీ ప్రమేయం లేదని ఎన్నికల సంఘానికి బీజేపీ వివరణ ఇచ్చింది. ఈనెల 18వ తేది కోయంబత్తూర్‌లో బీజేపీ నిర్వహించిన రోడ్‌షోలో మోదీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు తరలిరాగా, కొందరు పాఠశాల విద్యార్థులు యూనిఫాం ధరించి పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఎన్నికల ప్రచారంలో విద్యార్థులను వినియోగించారంటూ డీఎంకే, సీపీఐ తదితర పార్టీలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఎన్నికల కమిషన్ నోటీసుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ కోవై ఉత్తరం శాసనసభ నియోజకవర్గ ఉప ఎన్నికల అధికారి సురేష్‌కు అందజేసిన వివరణలో, మోదీని చూడాలనే ఆసక్తితోనే విద్యార్థులు హాజరయ్యారని, ఇందులో పార్టీ ప్రమేయం లేదని వివరణ ఇచ్చారు. అదే సమయంలో, విద్యార్థులకు తప్పుడు మార్గంలో తీసుకెళ్లారనే సెక్షన్ కింద పాఠశాల నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. అలాగే, రోడ్ షోలో పాల్గొన్న వడవల్లి చిన్మయ విద్యాలయ పాఠశాల నిర్వాహకులు వివరణ ఇవ్వాలని కోరుతూ ప్రైవేటు పాఠశాలల జిల్లా విద్యాధికారి సెంథిల్ నోటీసు జారీచేశారు.

## కీల్పాలూరులో కోలాహలంగా అగ్ని వసంతోత్సవం


125 అడుగుల దుర్యోధన ప్రతిమ - భీముడు, దుర్యోధనుడు వేషధారణలో కళాకారుల ప్రదర్శన

ప్యారీస్, మార్చి 21: తిరువణ్ణామలై జిల్లా కలశపాక్కం సమీపంలోని కీల్పాలూరులో మహాభారత ఉపన్యాసం, అగ్నివసంత ఉత్సవాలు కోలాహలంగా జరిగాయి. 24 ఏళ్ల అనంతరం నిర్వహించిన ఈ వేడుకలను వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాలవాసులు గురువారం ఉదయం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వేదిక ప్రాంగణంలో 125 అడుగుల దుర్యోధన ప్రతిమ వద్ద భీముడు, దుర్యోధనుడు తదితర మహాభారతంలోని పాత్రలతో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## తొమ్మిది పంచలోహ విగ్రహాల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న విగ్రహాలు

పెరంబూర్, మార్చి 21: కుంభకోణం సమీపంలో గురువారం ఉదయం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు జరిపిన తనిఖీల్లో 9 పంచలోహ విగ్రహాలు స్వాధీనం చేసుకున్నారు. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపం తిరువిడైమరుదూర్ యూనియన్ ఆనైక్కరైలో అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో స్వామిమలై నుంచి తగిన రసీదులు లేకుండా ఆంధ్ర రాష్ట్రానికి తరలిస్తున్న 9 పంచలోహ విగ్రహాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విగ్రహాలను తిరువిడైమరుదూర్ తహసీల్దార్ భాగ్యరాజాకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

## విద్యార్థి ప్రాణం తీసిన సైన్స్ పరిశోధన

పెరంబూర్, మార్చి 21: సైన్స్ పరిశోధనలపై ఆసక్తికి ఓ విద్యార్థి బలయ్యాడు. కొళత్తూర్‌కు చెందిన ప్లస్‌టూ విద్యార్థి ఆదిత్య ప్రవణ్‌కు సైన్స్ పరిశోధనలు చేసి అందరి ప్రశంసలు పొందాడు. ఈ నేపథ్యంలో, కొద్దిరోజుల క్రితం అతను ఇంట్లో ప్రయోగం చేస్తున్న సమయంలో దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలు చెందారు. ఈ వ్యవహారంపై ఆదిత్య తండ్రిని కూడా చుట్టుపక్కల వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, గురువారం ఉదయం ఆదిత్య ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఇంటి గోడ, పైకప్పు కూలి పడ్డాయి. వాటి కింద చిక్కుకొని ఆదిత్య మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## నగదు, బీడి బండిళ్లు స్వాధీనం

ప్యారీస్, మార్చి 21: స్థానిక పూందమల్లి సమీపంలోని వరదరాజపురంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.86 వేల నగదు, 198 బీడి బండిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తిరువళ్లూర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉన్న వరదరాజపురంలోని మీంజూరు - వండలూరు 400 అడుగుల రహదారిలో జరిపిన తనిఖీల్లో నగదు, బీడీలను రసీదులు లేని కారణంగా రెవెన్యూ కార్యాలయానికి అప్పగించారు. కారులో తరలించిన రూ.1.30 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేకేనగర్ వలసరవాక్కం సమీపంలోని ఆళ్వార్ తిరునగర్‌కు చెందిన గుణశేఖరన్ నడిపిన కారును తనిఖీ చేసిన పోలీసులు ఎలాంటి రసీదులు లేని నగదును స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఖజానాకు అప్పగించారు.

## దళితులకు హెయిర్ కటింగ్ చేసేందుకు నిరాకరణ

- ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, మార్చి 21: రాశిపురం సమీపంలో దళిత వర్గానికి చెందిన వారికి హెయిర్ కటింగ్ చేసేందుకు నిరాకరించిన వ్యవహారంలో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. సెలూన్ దుకాణం యజమాని ముత్తు, ఊరి కట్టుబాటు అని పేర్కొంటూ తన ఇద్దరు కుమారులకు కటింగ్ చేసేందుకు నిరాకరించాడని అరుణ్ పాండ్యన్ ఫిర్యాదును విచారించిన పోలీసులు ముత్తును అరెస్ట్ చేశారు. అలాగే, గ్రామ కట్టుబాటు విధించిన సెల్వరసు, రాజేష్‌కుమార్‌ను అంటరానితన నిరోధక చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, అరెస్ట్ చేసిన సెల్వరసు, రాజేష్‌కుమార్‌ను విడుదల చేయాలని, లేకపోతే పార్లమెంటు ఎన్నికలు బహిష్కరిస్తామని గ్రామస్తులు ఆందోళనలు చేపట్టారు.

## ఆలందూర్‌లో ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు


పాఠశాలలో తనిఖీలు చేస్తున్న బాంబ్ స్క్వాడ్

పెరంబూర్, మార్చి 21: స్థానిక ఆలందూర్‌లోని ప్రైవేటు పాఠశాలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. పాఠశాల నిర్వాహకుల ఫిర్యాదుతో బాంబు స్క్వాడ్ నిపుణులు, పోలీసు జాగిలంతో అక్కడికి చేరుకుని క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఈ ఫేక్ ఈ-మెయిల్ అని నిర్ధారించారు. కాగా, ఈ-మెయిల్ రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్ కుమారుడు పేరుతో నకిలీ ఈ-మెయిల్ రూపొందించి, బాంబు బెదిరింపు మెసేజ్ పంపినట్లు విచారణలో తేల్చిన పోలీసులు, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు.

## గుండె నాళంలో చిక్కుకున్న ట్యూబ్ తొలగింపు

- రేలా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స


రోగిని పరామర్శిస్తున్న వైద్య బృందం

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా ఆసుపత్రిలో క్యాన్సర్‌తో బాధపడుతున్న 39 యేళ్ల వ్యక్తి గుండె నాళంలో చిక్కుకున్న క్యాథెటర్ ట్యూబును ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వైద్య నిపుణులు శస్త్రచికిత్స ద్వారా తొలగించి ప్రాణగండం నుంచి కాపాడారు. కెమోపోర్ట్ క్యాథెటర్ ట్యూబును రక్త ప్రవాహంలో కీమోథెరపీ ఔషధాలను సరఫరా చేయడానికి వాడుతుంటారని, ఆ ట్యూబ్ పరికరం గుండె నాళంలో తేలియాడటానికి బదులుగా రెండు అంచుల దాకా ఉబ్బి అడ్డుగోడలా నిలిచిందని ఆ ఆసుపత్రి ఇంటర్వెన్షనల్ రేడియాలజీ ఇమేజింగ్ సర్వీసెస్ సీనియర్ కన్సల్టెంట్ టి. దీపాశ్రీ తెలిపారు. ఆ ట్యూబ్ తొలగించడానికి రెండు గంటలపాటు శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. చికిత్స తర్వాత రోగి త్వరగా కోలుకున్నాడని తెలిపారు.

## సీనియర్ హౌసింగ్ లివింగ్ సెక్టార్‌లో జీటీబీ పెట్టుబడులు




అడయార్, మార్చి 21: జీటీ భారతి అర్బన్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (జీటీబీ) తాజాగా భారతి హౌసింగ్స్, జీటీ గ్రూపులతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సీనియర్ హౌసింగ్ అండ్ అసిస్టెడ్ లివింగ్ సెక్టార్‌లో రూ.350 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టనుంది. ఈ ప్రాజెక్టును ఎలిమెంట్స్ సీనియర్ లివింగ్ పేరుతో నిర్మించనున్నారు. ఈ పెట్టుబడి మొత్తాన్ని రానున్న రెండేళ్లలో దశలవారీగా ఖర్చు చేయనుంది. రానున్న మూడేళ్లలో జీటీబీ కనీసం 20 రిటైర్మెంట్ కమ్యూనిటీ, అసిస్టెడ్ లివింగ్ ఫెసిలిటీస్‌ను స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ సంస్థ పేర్కొంది.

## 32మంది తమిళ జాలర్ల అరెస్టు

- శ్రీలంక నావికా దళం చర్యలు

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళిన 400 మంది జాలర్లలో 32 మంది జాలర్లను శ్రీలంక నావికా దళం అరెస్టు చేసింది. వీరినుంచి ఐదు మర బోట్లను స్వాధీనం చేసుకుంది. బుధవారం ఉదయం 400 మంది జాలర్లు మరబోట్లలో సముద్రంలోకి వెళ్లారు. వీరంతా అర్ధరాత్రి సమయంలో చేపల వేట కొనసాగిస్తుండగా శ్రీలంక నావికాదళం వారిని చుట్టుముట్టి మొత్తం 5 మర పడవల సహా అదుపులోకి తీసుకుని తమ దేశానికి తరలించింది. ఈ జాలర్ల వద్ద విచారణ తర్వాత గురువారం ఉదయం శ్రీలంక కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. శ్రీలంక నావికాదళం నుంచి తప్పించుకున్న జాలర్లు గురువారం ఉదయం జరిగిన విషయాన్ని చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

## బ్యాంకు మేనేజర్ హత్యకు కిరాయి ముఠా

- మహిళా అధికారి సహా ఐదుగురి అరెస్టు

అడయార్, మార్చి 21: నామక్కల్ జిల్లాలో బ్యాంకు సీనియర్ మేనేజరును హత్య చేసేందుకు కిరాయి ముఠాను పంపించిన కేసులో మహిళా ఉన్నతాధికారి సహా ఐదుగురుని పోలీసులు అరెస్టు చేశారు. ఈరోడ్ జిల్లా భవానీ నటరాజపురానికి చెందిన గోపీనాథ్ నామక్కల్‌లోని ఒక ప్రైవేటు బ్యాంకులో మేనేజరు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. గోపీనాథ్ ఈ నెల 18వ తేదీన విధులు ముగించుకుని స్కూటరులో ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో నామక్కల్ సౌత్ ప్రభుత్వ బాలుర హైస్కూల్ వద్ద ఆయనపై ఉన్నట్టుండి కొందరు దాడి చేశారు. తప్పించుకున్న ఆయన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా, ఈ విచారణలో తన బ్యాంకులోనే అసిస్టెంట్ మేనేజరుగా పనిచేసే కావ్య.. సెల్లీశ్వరన్, శివకుమార్, పార్తిబన్, దినేష్‌తో కలిసి గోపీనాథ్‌ను హత్య చేసేందుకు యత్నించారు. దీంతో ఈ ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

## జాతీయ జెండాతో ఉరేసుకున్న మహిళ

- ఎగ్మోర్ ఆర్పీఎఫ్ ఆఫీసులో విషాదం

అడయార్, మార్చి 21: స్థానిక ఎగ్మోర్‌లోని ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో జాతీయ జెండాతో ఒక మహిళ ఉరేసుకుంది. ఆ మహిళ ఓ అనాథ అని ఓ టీ మాస్టర్ ఆమెపై అత్యాచారం జరిపాడని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. దీంతో అతడిని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు. ఈనెల 17న ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలోని ఒక గది కిటికీ ఇనుప చువ్వకు జాతీయ జెండాతో 40 యేళ్ళ మహిళ ఉరేసుకుని ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ఈ విచారణలో భాగంగా రైల్వే స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. అందులో తాంబరం శానిటోరియంలో రైల్వే స్టేషన్ సమీపంలో టీ షాపులో పనిచేసే టీ మాస్టర్ కరుప్పయ్యన్ ఆ మహిళతో నడిచి వెళుతున్నట్టు గుర్తించారు. వెంటనే ఆయన్ను అరెస్టు చేసి విచారించగా, ఆ మహిళపై అత్యాచారం చేసినట్టు అంగీకరించాడు.

## ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

**బస్సులో రూ.35 లక్షల స్వాధీనం**

అడయార్, మార్చి 21: తెన్‌కాశిలో ప్రభుత్వ బస్సులో రూ.35 లక్షలను తీసుకెళ్తుండగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ గుర్తించి, ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకుంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో భారీ మొత్తంలో డబ్బులు తరలించాలంటే తగిన ఆధారాలను చూపించాల్సి ఉంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి తెన్‌కాశి జిల్లా కుత్తుకల్వసై ప్రాంతంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. ఆ సమయంలో అటుగా వచ్చిన బస్సును ఆపి తనిఖీ చేయగా, అందులోని ఒక ప్రయాణికుడి వద్ద రూ.35 లక్షల నగదు ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రయాణికుడిని తెన్‌కాశి అరుమనై వీధికి చెందిన అలీ(32)గా గుర్తించారు. ఈయన నగదు తీసుకెళ్ళేందుకు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఈ డబ్బును స్వాధీనం చేసుకుని, స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అప్పగించారు.

## కొట్టివాక్కంలో గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్

అడయార్, మార్చి 21: నగర శివారు ప్రాంతమైన కొట్టివాక్కంలో గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ ప్రారంభించారు. హీరో శ్రీకాంత్, హీరోయిన్ ఇనియ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అత్యాధునికమైన సాంకేతికతో వెంట్రుకలు తిరిగి పెరిగేలా ఈ క్లినిక్‌లో చికిత్స చేస్తారని బ్రాండ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ శరన్ వేల్ జే తెలిపారు. క్లినికల్, నాన్ క్లినికల్ విధానాలను అవలంబిస్తూ, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా చికిత్స అందిస్తారు. ఇందుకోసం పెర్క్యుటేనిస్ ఎఫ్‌యూఈ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్, స్టెమ్ ఎక్స్ 27 టీఎం, (పీఆర్‌పీ ప్రోప్లస్), లేజర్ హెయిర్ థెరపీ, కాస్మోటిక్ సిస్టమ్, జీఎఫ్‌సీ ఫిబ్రిన్ టీఎం తదితర విధానాలను అనుసరిస్తున్నట్టు వెల్లడించారు.


గ్రోహెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ ప్రారంభ దృశ్యం

## ఎన్నికల పనులకు సొంత వాహనాలొద్దు

ఐసిఎఫ్, మార్చి 21: ఎన్నికల పనులకు సొంత వాహనాలు వినియోగించడాన్ని అనుమతించరాదని ఆర్టీఓలకు రవాణా శాఖ కమిషనర్ షణ్ముగసుందరం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల పర్యవేక్షణ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎన్నికల అధికారులు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రభుత్వం తరఫున ఒప్పంద పద్ధతిలో వాహనాలు అద్దెకు తీసుకోవడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం ఈ వాహనాలు కార్పొరేట్ సంస్థ వద్ద మొత్తంగా ఒప్పంద పద్ధతిలో కొన్ని జిల్లా యంత్రాంగాలు అద్దెకు తీసుకున్నాయి. కొందరు అధికారులు సొంత వాహనాలు వినియోగిస్తున్నట్లు రవాణా కమిషనర్‌కు ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన కమిషనర్, అధికారులు సొంత వాహనాలు వినియోగించడాన్ని అడ్డుకోవాలని ఆర్టీఓలకు ఆదేశాలు జారీ చేశారు.

## రేపు అఖిలపక్షపార్టీల సమావేశం

- సత్యప్రదసాహు

పెరంబూర్, మార్చి 21: లోక్‌సభ ఎన్నిలకు సంబంధించి ఈ నెల 23వ తేది అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు తెలిపారు. ఏప్రిల్ 19వ తేది నుంచి ప్రారంభం కానున్న ఎన్నికలు, ఏడు విడతలుగా జూన్ 1వ తేదీతో ముగిసి, జూన్ 4వ తేది ఓట్ల లెక్కింపు జరగనుంది. రాష్ట్రంలో ఏప్రిల్ 19వ తేది ఒకే విడతలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో, స్థానిక సచివాలయంలో ఈనెల 23వ తేది మధ్యాహ్నం 12 గంటలకు అఖిలపక్ష పార్టీలతో సమావేశమై, ఎన్నికలకు సంబంధించి చర్చించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు తెలిపారు.

## ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగం


సమావేశంలో ప్రసంగిస్తున్న ఏసీ షణ్ముగం

వేలూరు, మార్చి 21: లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని బీజేపీ అభ్యర్థి ఏసీ షణ్ముగం కోరారు. నగరంలో గురువారం ఎన్డీఏ కూటమి పార్టీ సమావేశం నిర్వహించగా, పీఎంకే జిల్లా సెక్రటరీ ఇళవయగన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్టీ షణ్ముగం, ఏఎంఎంకే నేత పార్తిబన్, టీఎంసీ నేత మూర్తి, బీజేపీ నాయకుడు వెంకటేశన్ సహా కూటమి పార్టీల నేతలు హాజరయ్యారు. కార్యక్రమంలో పుదియ నీది కట్చి అధ్యక్షుడు ఏసీ షణ్ముగం మాట్లాడుతూ... గత ఎన్నికల్లో తాను ఓటమి చెందినా నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు అండగా ఉంటూ, వారికి సంక్షేమ సహాయాలు, ఉచిత వైద్య శిబిరాలు, నిరుద్యోగులకు ఉపాధి చూపేలా జాబ్ మేళాలు నిర్వహించినట్లు తెలిపారు.

## మా అభ్యర్థిని అరెస్ట్ చేసేందుకు కుట్ర

- డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్


ప్రసంగిస్తున్న దురైమురుగన్

వేలూరు, మార్చి 21: తమ పార్టీ తరఫున పోటీచేస్తున్న ఓ అభ్యర్థిని అరెస్ట్ చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని డీఎంకే ప్రధాన కార్యదర్శి, మంత్రి దురైమురుగన్ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార నిమిత్తం గుడియాత్తంలో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... తాను నియోజకర్గంలో చేసిన అభివృద్ధిని గుర్తిస్తున్న ప్రజలు 12 సార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. ప్రధాని మోదీ సైతం తన గెలుపుపై ఆశ్చర్యం వ్యక్తం చేశారన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాలకు ఈవీఎంలు


ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మార్చి 21: స్థానిక సత్తువాచేరిలో ఉన్న స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలు, వీవీ పాట్లను తహసీల్దార్ కార్యాలయాలకు తరలించే పనులు గురువారం అంగీకరించబడిన రాజకీయ పార్టీల నేతల సమక్షంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించా రు. వేలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని అనైకట్టు, వేలూరు, కేవీకుప్పం, గుడియాత్తం శాసనసభ నియోజకవర్గాలు, అరక్కోణం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని కాట్పాడి శాసనసభ నియోజకవర్గంలోని తహసీల్దార్ కార్యాలయాలకు ఈ పరికరాలు తరలించారు. వీటిలో 1,561బెల్ట్ యూనిట్లు, 1,561 కంట్రోల్ యూనిట్లు, 1,692 వీవీ పాట్లు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ యంత్రాలను డ్రా పద్ధతిలో ఎంపిక చేసి సంబంధిత తహసీల్దార్ కార్యాలయాలకు తరలించినట్లు ఆమె తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి మాలతి తదితరులు పాల్గొన్నారు.

## ఈషా కేంద్రంలో ఆరుగురు ఉద్యోగుల అదృశ్యం

- హైకోర్టుకు తెలిపిన పోలీసు శాఖ

పెరంబూర్, మార్చి 21: ఈషా యోగా కేంద్రంలో పనిచేస్తున్న వారిలో ఇప్పటివరకు ఆరుగురు కనిపించడం లేదని మద్రాసు హైకోర్టుకు పోలీసు శాఖ తెలియజేసింది. తెన్‌కాశి జిల్లా కులశేఖపట్టణానికి చెందిన రైతు తిరుమల మద్రాసు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో.. తన సోదరుడు గణేశన్ 2007 నుంచి ఈషా యోగా కేంద్రంలో స్వచ్ఛందంగా పనిచేస్తున్నాడని, గత ఏడాది మార్చి 2న కేంద్ర నిర్వాహకులు తనను సెల్‌ఫోన్‌లో సంప్రదించి, గణేశన్ స్వగ్రామానికి వచ్చాడా? మూడు రోజుల నుంచి యోగా కేంద్రానికి రావడం లేదని తెలిపారన్నారు. ఈ విషయమై ఆలందురై పోలీసులకు ఫిర్యాదు చేశానని, ఏడాది గడిచినా కేసు విచారణలో పురోగతి లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్ గురువారం హైకోర్టు న్యాయమూర్తి ఎంఎస్ రమేష్, న్యాయమూర్తి సుందర్‌మోహన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ప్రభుత్వం తరఫున హాజరైన న్యాయవాది రాజ్‌తిలక్.. 2016 నుంచి వేర్వేరు తేదీల్లో ఇప్పటివరకు ఆరుగురు కనిపించకుండా పోయారని, వారి గురించి విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ వివరణపై స్పందించిన ధర్మాసనం, విచారణ త్వరితగతిన పూర్తిచేయాలని పేర్కొంటూ, తదుపరి విచారణ ఏప్రిల్ 8వ తేదీకి వాయిదావేసింది.

## గుర్తింపుకార్డు కోరుతూ మురుగన్ పిటిషన్

పెరంబూర్, మార్చి 21: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకేసులో విడుదలై తిరుచ్చి శిబిరంలో ఉంటున్న మురుగన్, తనకు గుర్తింపు కార్డు అందించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశాడు. లండన్‌లో ఉంటున్న తమ కుమార్తె వద్దకు వెళ్లి నివసించాలని అనుకుంటున్నానని, అందుకోసం పాస్‌పోర్ట్ కోరుతూ వినతిపత్రం సమర్పించానని తెలిపారు. ఆ వినతిపత్రంలో ఫొటోతో కూడిన గుర్తింపు కార్డు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉందన్నారు. దీంతో, తనకు గుర్తింపుకార్డు అందించాలని వినతి పత్రం సమర్పించినా ఇప్పటివరకు స్పందించలేదని, అందువల్ల తనకు గుర్తింపు కార్డు అందించేలా పునరావాస డైరెక్టర్‌కు ఉత్తర్వులు జారీచేయాలని మురుగన్ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ గురువారం న్యాయమూర్తి ఎంఎస్ రమేష్, న్యాయమూర్తి సుందర్ మోహన్‌తో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఆ సమయంలో ఈ కేసు విచారణ నుంచి తాను తప్పుకుంటున్నట్లు న్యాయమూర్తి సుందర్‌మోహన్ తెలిపారు. దీంతో, మురుగన్ కేసు విచారణ వేరే ధర్మాసనం జాబితాలో చేర్చేలా ప్రధాన న్యాయమూర్తి అనుమతి తీసుకోవాలని రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు జారీచేసింది.

## పొలంలో బస్సు బోల్తా : 15 మందికి గాయాలు



చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపంలో రాష్ట్ర రవాణా సంస్థ బస్సు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న పొలంలో బోల్తాపడటంతో 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. గురువారం ఉదయం తిరుచ్చి జిల్లా లాల్గుడి సమీపం నత్తమాంగుడి నుంచి రాష్ట్ర రవాణా సంస్థ బస్సు ప్రయాణికులతో సత్రం బస్టాండుకు బయలుదేరింది. మేట్టుపట్టి వద్ద అదుపు తప్పి పొలాల్లో బోల్తా పడింది. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గాయపడినవారిని లాల్గుడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో తిరుచ్చి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

● కాలం మారుతోందిగా!

## గాడిదలకు బదులు ట్రాక్టర్లపై ఎన్నికల సామగ్రి



గాడిదల ద్వారా ఎన్నికల సామగ్రి తరలిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

పెరంబూర్, మార్చి 21: ఆధునిక కాలంలోనూ కొండ ప్రాంతాలకు కనీస రవాణా సదుపాయం లేక అల్లాడిపోయే ప్రజలను చూస్తున్నాం. ఇప్పటికీ కొండ గ్రామాలకు రవాణా వసతి లేకపోవడంతో గాడిదల ద్వారా ఎన్నికల సామగ్రి తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కలెక్టర్ కృషితో ఈ ఎన్నికల్లో గాడిదలకు బదులుగా ట్రాక్టర్లపై ఎన్నికల సామగ్రి తరలించనున్నారు. ధర్మపురి జిల్లా పెన్నాగరం పంచాయతీ పరిధిలోని కొండ గ్రామాలైన కోట్టూరులో 310 మంది, ఏరిమలైలో 324 మంది ఓటర్లున్నారు. ఈ గ్రామాలకు సరైన రోడ్డు వసతి లేకపోవడంతో రేషన్ సహా కిరాణా సరుకులు, వైద్య అవసరాలకు గ్రామస్తులు కొండ దిగి కిందకు రావాల్సి ఉంది. కోట్టూరు గ్రామస్తులు 6 కి.మీ, ఏరిమలై గ్రామస్తులు 4.2 కి.మీ దూరం ప్రయాణించాల్సి ఉంది. ఈ గ్రామాల్లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది కాలినడకన ఎన్నికల సామగ్రిని గాడిదలపై తరలిస్తుంటారు. ఈ నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ శాంతి కొద్దిరోజుల క్రితం రెండు గ్రామాలను సందర్శించి ట్రాక్టర్లు వెళ్లేలా రోడ్డు వసతి కల్పించారు. రాబోయే ఎన్నికల్లో తొలిసారిగా గాడిదలకు బదులుగా ట్రాక్టర్లపై ఎన్నికల సామగ్రి తరలించనున్నామని అధికారులు తెలిపారు.






చెన్నైలో ప్రచారం కోసం సిద్ధమైన డీఎంకే శ్రేణులు

● పయనమెటో ?!

## చిన్నమ్మ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి!



పెరంబూర్, మార్చి 21: ఒకప్పుడు 'అమ్మ' జయలలిత మాటున కనుసైగలతో అన్నాడీఎంకేను శాసించి, ఆనక జరిగిన పరిణామాల్లో తీవ్ర భంగపాటుతో ఏకాకిగా మిగిలిన చిన్నమ్మ శశికళ.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఏం చేయబోతున్నారన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. చిన్నమ్మ నుంచి ఎలాంటి సంకేతాలు వెలువడకపోవడంతో ఆమె అనుచరగణం, అభిమానులు డైలమాలో పడిపోయారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నాలుగేళ్ల జైలుశిక్ష అనంతరం బెంగళూరు జైలు నుంచి విడుదలైన శశికళ.. వరుసబెట్టి కార్యకర్తలను కలుసుకున్నారు. పలుప్రాంతాలకు వెళ్లి అభిమానుల్ని ఆనందపరిచారు. దీంతో, ఆమె మళ్లీ రాజకీయాల్లో చక్రం తిప్పుతారని భావించారు. ఆలయాల సందర్శన, మద్దతుదారులతో సమావేశాలు నిర్వహించిన శశికళ, మూడు ముక్కలైన పార్టీని ఒక్కటిగా చేయాలనేది తన లక్ష్యమని ఆమె ప్రకటించారు కూడా. ఇందుకోసం అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం కూడా శశికళతో కలసి పనిచేస్తానని ప్రకటించారు. కానీ వారిద్దరినీ దరి చేర్చుకునేందుకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ససేమిరా అన్నారు. దీంతో పన్నీర్‌సెల్వం, శశికళ మేనల్లుడు టీటీవీ దినకరన్ బీజేపీ పంచన చేరారు. ఇప్పుడు శశికళ ఏం చేస్తారన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఆమె తన అనుచరులైన పన్నీర్‌సెల్వం, దినకరన్ చెప్పినట్లు బీజేపీ కూటమికి మద్దతు ఇస్తారా లేక, అన్నాడీఎంకేకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తారా లేక ఎవ్వరికీ మద్దతు పలుకకుండా స్తబ్ధుగా ఉండిపోతారా అన్నదానిపై చర్చనీయాంశంగా మారింది.

● తొలిసారి..!

## నాగై, మైలాడుదురైలో నామినేషన్ల స్వీకరణ

పెరంబూర్, మార్చి 21: నాగపట్టినం, మైలాడుదురై జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో తొలిసారిగా నామినేషన్ల స్వీకరణ జరుగుతోంది. నాగపట్టినం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నాగపట్టినం, కీళవేలూరు, వేదారణ్యం,తిరువారూర్ జిల్లాలోని తిరువారూర్, నన్నిడం, తిరుత్తురైపూండి తదితర ఆరు శాసనసభ నియోజకవర్గాలున్నాయి. అలాగే, మైలాడుదురై లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో పూంపుహార్, మైలాడుదురై,శీర్గాళి, తంజావూరు జిల్లాలోని కుంభకోణం, తిరువిడైమరుదూర్, పాపనాశం తదితర ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అయితే నాగపట్టినం లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల అధికారిగా తిరువారూర్ జిల్లా కలెక్టర్, మైలాడుదురై లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల అధికారిగా నాగపట్టినం జిల్లా కలెక్టర్ వ్యవహరించేవారు. ఈ నేపథ్యంలో, మైలాడుదురై ప్రత్యేక జిల్లాగా ఏర్పడడంతో తొలిసారిగా మైలాడుదురై లోక్‌సభ నియోజకవర్గానికి మైలాడుదురై జిల్లా కలెక్టర్ మహాభారతి, నాగపట్టినం లోక్‌సభ నియోకవర్గానికి నాగై జిల్లా కలెక్టర్ నియమితులయ్యారు. దీంతో, తొలిసారిగా ఆయా జిల్లాల్లోనే నామినేషన్ల దాఖలు ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది.

## సిమ్లా ముత్తుచోళన్‌కు అన్నాడీఎంకేలో ఎంపీ టిక్కెట్టు

● గతంలో జయపై పోటీ


చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై ప్రాంతాన్ని దశాబ్దాల తరబడి డీఎంకేకు కంచుకోటగా మార్చి పార్టీకి ఎనలేని సేవలందించిన మాజీ మంత్రి దివంగత సర్గుణ పాండ్యన్ కోడలు, ఆర్కేనగర్ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి జయలలితపై పోటీ చేసిన సిమ్లా ముత్తుచోళన్ ఇటీవల అన్నాడీఎంకేలో చేరిన విషయం తెలిసిందే. ఆమె లోక్‌సభ ఎన్నికల్లో తిరునల్వేలి నియోజకవర్గం అభ్యర్థిగా ఎంపికయ్యారు. పార్టీలో చేరిన కొద్ది రోజుల్లోపే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్‌కి విశ్వాసపాత్రురాలిగా మారారు. అంతేకాకుండా విద్యావంతురాలిగా, హైకోర్టు న్యాయవాదిగా ఉండటంతో ఈపీఎస్ ఎంపీ సీటిచ్చి ఆమెను ఎన్నికల బరిలోకి దింపారని పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున పోటీ చేస్తున్న ఏకైక మహిళా అభ్యర్థిగా నిలిచారు.

ఇంతకీ ఎవరీ సిమ్లా ముత్తు చోళన్?...

డీఎంకే మాజీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి సర్గుణపాండ్యన్ రెండో కోడలు సిమ్లా ముత్తుచోళన్. ఈమె పూర్వీకులు కన్నియాకుమారి రామన్‌పుదూరుకు చెందినవారు. ఈమె పుట్టిపెరిగింది చెన్నైలోనే. ఈమె అసలు పేరు ఆంటోని సిమ్లాషిని. ఆర్‌సీ క్రైస్తవ మత శాఖకు చెందినవారు. ఈమె తాత 'పునిద ఆంథోనియర్' అనే చలనచిత్రాన్ని నిర్మించి, పోప్ ఆశీస్సులందుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత చదివిన చర్చ్‌పార్కు కాన్వెంట్‌లోనే సిమ్లా ముత్తు చోళన్‌కూడా చదివారు. బీఏ, ఎల్ఎల్‌బీ చదివి ప్రస్తుతం మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా ఉన్నారు. ఆమె భర్త ముత్తుచోళన్ కూడా న్యాయవాదే. వీరికి ఓ కుమారుడు. సిమ్లా ముత్తుచోళన్ తన అత్తగారైన సర్గుణపాండ్యన్ బాటలో నడిచి రెండు దశాబ్దాలకు పైగా డీఎంకేకి సేవలందించారు. తొలుత డీఎంకే నార్త్ చెన్నై మహిళా న్యాయవాదుల విభాగం ఇన్‌ఛార్జిగా, ఆ తర్వాత డీఎంకే మహిళా విభాగం ప్రచార కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలోనే 2016లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్కేనగర్‌లో అప్పటి ముఖ్యమంత్రి జయలలితపై డీఎంకే అభ్యర్థిగా తలపడ్డారు.ఆ ఎన్నికల్లో 30వేల ఓట్ల మెజారిటీతో జయలలిత గెలిచారు. ఆ ఎన్నికల్లో జయపై పోటీ చేయడం వల్ల సిమ్లా ముత్తుచోళన్ రాష్ట్రస్థాయిలో పేరుగడించారు. జయ మృతి తర్వాత ఆర్కేనగర్ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికల్లో సిమ్లా ముత్తుచోళన్‌ను డీఎంకే పోటీకి దింపుతుందని అందరూ అనుకున్నారు. చివరి క్షణంలో డీఎంకే అభ్యర్థిగా మరుదుగణేష్ పోటీకి దిగారు. ఆ ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థిగా పోటీ చేసిన టీటీవీ దినకరన్ గెలిచారు. మరుదుగణేష్ డిపాజిట్ కోల్పోయారు. ఆ తర్వాత జరిగిన ఏ ఎన్నికల్లోనూ సిమ్లా ముత్తుచోళన్‌కు డీఎంకే పోటీ చేసే అవకాశం ఇవ్వలేదు. దీంతో డీఎంకేపై విరక్తి చెందిన ఆమె ఇటీవలే అన్నాడీఎంకేలో చేరారు. డీఎంకే అధిష్ఠానం తనపై ఉదాశీనంగా వ్యవహరించడం వల్లే అన్నాడీఎంకేలో చేరానని ఆమె పేర్కొన్నారు. డీఎంకేలో ప్రస్తుతం వారసత్వ రాజకీయాలే నడుస్తున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో పార్టీలో చేరిన కొద్ది రోజులకే సిమ్లా ముత్తుచోళన్‌ను తిరునల్వేలి అభ్యర్థిగా ఎంపిక చేసి ఈపీఎస్ పార్టీనేతలందరిని విస్తుపోయేలా చేశారు.



ఈపీఎస్‌తో సిమ్లా ముత్తుచోళన్



● సణుగులు... చెణకులు

**కమలహాసన్**
నేను పాల్గొనే ప్రచార సభల్లో కను సైగలతోనూ ఓట్లు అభ్యర్థించగలను

**సాధారణ ఓటరు**
అయ్యా! మీరు మాట్లాడే రాజకీయ పదాలు అస్సలు అర్థం కావడం లేదు. అలాంటప్పుడు కను సైగలే బెటరేమో!



వాగై చంద్రశేఖర్ | ఇమాన్ అన్నాచ్చి | వింధ్య | గౌతమి | ఖుష్బూ | నమిత

## ఎన్నికల ప్రచారానికి తారలు సిద్ధం

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల దాకా ప్రధాన పార్టీల తరఫున సినీ తారలు, బుల్లితెర నటీనటులు ప్రచారం చేయడం ఆనవాయితీ. ఈ లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ కూటమి అభ్యర్థుల ప్రచారానికి అప్పుడే సినీ నటీనటులు సిద్ధమయ్యారు. ఈ తారలంతా పార్టీ అధిష్ఠానం అనుమతి కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రధాన పార్టీలు ఈ తారల ప్రచారానికి వాహనం సహా అన్ని సదుపాయాలు కల్పిస్తాయి. డీఎంకే తరఫున సినీనటులు వాగై చంద్రశేఖర్, బెంజమిన్, ఇమాన్ అన్నాచ్చి, బోస్ వెంకట్ ప్రచారం చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇదే విధంగా అన్నాడీఎంకే తరఫున సింగముత్తు, వయ్యాపురి, వింధ్య, నాంజిల్ అన్బళగన్, గౌతమి, గాయత్రి రఘురాం, అనుమోహన్, బబితా, జయమణి ప్రచారం చేయనున్నారు. బీజేపీ కూటమికి మద్దతుగా నటి ఖుష్బూ, నమిత, రంజనా నాచ్చియర్ సహా పలువురు సినీతారలు ప్రచారం చేయడానికి తరలివస్తున్నారు.



● ఓటేద్దాం రండి

## తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న 10.45 లక్షల మంది

పెరంబూర్, మార్చి 21: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకొనే వారి సంఖ్య 10.45 లక్షలకు పెరిగింది. రాష్ట్రంలో గత ఏడాది జూన్ 22వ తేది తుది ఓటరు జాబితా విడుదల చేశారు. ఆ సమయంలో, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకొనే 18 నుంచి 19 ఏళ్లలోపున్న వారి సంఖ్య 9,18,313గా ఉంది. అనంతరం ఓటరు జాబితాలో పేరు చేర్చే పనులను ఎన్నికల కమిషన్ ప్రారంభించింది. ఈ సందర్భంగా 90,000 వేలమంది 18 ఏళ్ల పూర్తయిన వారు వినతిపత్రాలు సమర్పించారు. వాటి పరిశీలన అనంతరం ఓటరు జాబితాలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకొనే వారి సంఖ్య 10,45,470కి పెరిగింది.



## ఎన్నికల బరిలో 'ఎలక్షన్ కింగ్'

● 239వ సారి నామినేషన్ వేసిన పద్మరాజన్

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): 'ఎలక్షన్ కింగ్'గా పేరుగాంచిన సేలం జిల్లా మేట్టూరుకు చెందిన పద్మరాజన్ మళ్లీ ఎన్నికల బరిలోకి దిగారు. ఇప్పటి వరకూ రాష్ట్రపతి సహా వివిధ ఎన్నికల కోసం 238 సార్లు నామినేషన్లు వేసిన పద్మరాజన్.. తాజాగా బుధవారం ధర్మపురి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేసేందుకు 239వ సారి నామినేషన్ వేశారు. ఇప్పటి వరకూ ఆయన అన్ని ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయినా, ఆయన నామినేషన్ల దాఖలు దాహం మాత్రం తీరడం లేదు.కాగా ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన కలిగించేందుకే తాను ఇలా నామినేషన్లు దాఖలు చేస్తున్నానే తప్పతనకెలాంటి పదవీ వ్యామోహం లేదని పద్మరాజన్ ఈ సందర్భంగా మీడియా వద్ద పేర్కొన్నారు.

● యువర్ అటెన్షన్

## 'సి విజిల్' యాప్ అంటే...

● ఎన్నికల అక్రమాలపై ఎలా ఫిర్యాదుచేయాలి?

పెరంబూర్, మార్చి 21: దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, బహుమతులు చేతులు మారుతుంటాయి. ఇలాంటి ప్రలోభాలను అడ్డుకొనేలా ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం అందివచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు ఈసీ చర్యలు చేపట్టింది. ఆ క్రమంలోనే, ఎన్నికల అక్రమాలపై ప్రజలు ఫిర్యాదుచేసేలా 'సి విజల్' యాప్ తీసుకొచ్చింది. దేశంలోని ఏ ప్రాంతం నుంచైనా, ఎవరైనా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ఓటర్ల నగదు, మద్యం, బహుమతులు తదితరాలపై ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే, అలాంటి సన్నివేశాలను రహస్యంగా చిత్రీకరించి 2 నిమిషాల వ్యవధి కలిగిన వీడియోలు ఈ యాప్ ద్వారా పంపించాలి. ఈ ఫిర్యాదులు అందిన 100 నిమిషాల్లో ఎన్నికల సంఘం అధికారులు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటారు.

**ఫిర్యాదు ఎలా?:** మన దగ్గర ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్ నుంచి సి.విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో మన వివరాలతో లాగిన్ అవ్వాలి. ఆ తర్వాత ఎక్కడైనా డబ్బు, మద్యం, బహుమతుల పంపిణీ తదితరాలను గుర్తించి, రహస్యంగా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అప్‌లోడ్ చేసే సమయంలో సెల్‌ఫోన్‌లో జీపీఎస్ ఆన్ చేసి ఉండాలి. అభ్యర్థులు, స్థానిక నాయకులు ఎవరైనా వచ్చి తమ పార్టీకి ఓటు వేయాలని డబ్బులు ఇచ్చేందుకు యత్నించినా, రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల ప్రచారంలో విద్వేషపూరిత ప్రసంగాలు చేసినా ఫిర్యాదు చేయవచ్చు. సి విజిల్ యాప్ ద్వారా పంపిన ఫొటోలు, వీడియోలు నేరుగా కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు చేరుతాయి. జీపీఎస్ ద్వారా మనం ఉన్న లోకేషన్‌ను ఎన్నికల సంఘం అధికారులు ట్రాక్ చేస్తారు. అనంతరం ఆ ఫిర్యాదు ఆ లోకేషన్ నుంచి జిల్లా కంట్రోల్ రూంకు వెళతాయి. వాటిని ఆ లోకేషన్‌కు దగ్గరలో ఉండే సంబంధిత అధికారులకు పంపిస్తారు. అధికారులు సత్వరం ఆ ఫిర్యాదులపై విచారణ చేపట్టి చర్యలు చేపడతారు. ఫిర్యాదు వచ్చిన 100 నిమిషాల్లో దానిపై అధికారులు విచారణ చేపట్టనున్నారు. అదే సమయంలో ఫిర్యాదులు చేసే వారిపై పార్టీలు, అభ్యర్థులు దాడి చేయడాన్ని అడ్డుకొనేలా ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది.






## ఏఎంఎంకేకు కుక్కర్ చిహ్నం

ఐసిఎఫ్, మార్చి 21: 'అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం' (ఏఎంఎంకే)కు ఎన్నికల కమిషన్ కుక్కర్ చిహ్నం కేటాయించింది. బీజేపీతో పొత్తు పెట్టుకున్న ఈ పార్టీ రెండు నియోజకవర్గాల్లో పోటీ చేయనున్న విషయం తెలిసిందే. గత ఎన్నికల్లో తమకు కేటాయించిన కుక్కర్ గుర్తును ఈ సారి కూడా తమకు కేటాయించాలని ఏఎంఎంకే ఎన్నికల కమిషన్‌ను అభ్యర్థించింది. ఆ మేరకు ఆ పార్టీ వినతిని పరిశీలించిన ఎన్నికల కమిషన్.. లోక్‌సభ ఎన్నికల్లో కుక్కర్ గుర్తును కేటాయించింది.

## బీజేపీ సభ్యత్వం తీసుకున్న తమిళిసై



సభ్యత్వ కార్డును తమిళిసైకి అందిస్తున్న అన్నామలై

చెన్నై, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ పదవికి రాజీనామా చేసి మళ్లీ బీజేపీకి సేవలందించాలనే కష్టమైన నిర్ణయాన్ని ఇష్టపడే తీసుకున్నానని తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించారు. బుధవారం ఉదయం ఆమె బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. టీనగర్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం కమలాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, ఎల్ మురుగన్ సమక్షంలో ఆమె పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ... బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలిగా గతంలో పార్టీకి, గవర్నర్‌గా రెండు రాష్ట్రాల ప్రజలకు సేవలందించిన తాను మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లో ప్రవేశించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం తాను సాధారణ కార్యకర్తగా పార్టీలో చేరానని, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. రాజ్‌భవన్‌ను విడిచి ప్రజా భవన్‌గా ఉన్న పార్టీ కార్యాలయానికి వచ్చానని, లోక్‌సభ సభ్యురాలిగా తమిళ ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతోనే గవర్నర్ పదవికి రాజీనామా చేశానన్నారు. ఏడేళ్ల క్రితం పార్టీ మహానాడుకు మోదీ విచ్చేసినప్పుడు 'మళ్లీ మోదీ.. రావాలి మోదీ' అంటూ తాను చేసిన నినాదం ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుండటం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ప్రస్తుతం తమిళనాట బీజేపీకి సానుకూల పవనాలు వీస్తున్నాయని, తామర తప్పకుండా వికసిస్తుందని తమిళిసై వ్యాఖ్యానించారు.

## జయకృష్ణ - చాందిని జంటగా 'ఆలకాలం'

జయకృష్ణ - చాందిని జంటగా 'ఆలకాలం' పేరుతో ఒక చిత్రం రూపుదిద్దుకుంది. విడుదలకు సిద్ధమైన ఈ చిత్రంలో తల్లి పాత్రలో సీనియర్ నటి ఈశ్వరీరావు మరోమారు వెండితెరపై మెప్పించనున్నారు. ఇతర పాత్రల్లో దీప, బాబా భాస్కర్, తంగదురై, కోదండం, సీజర్ మనోహర్ తదితరులు నటించారు. ప్రేమ, సెంటిమెంట్, యాక్షన్ ఇలా అన్ని అంశాలు కలగలిసిన చిత్రంగా రూపుదిద్దుకుంది. ఈ సినిమాకు ఏ ఒక్కరి వద్ద సహాయ దర్శకుడిగా పనిచేయని జయకృష్ణ.. తొలిసారి దర్శకత్వం వహించారు. గతంలో కూడా లోకేష్ కనకరాజ్, ఉరియడి విజయకుమార్, కార్తీక్ నరేన్ వంటివారు కూడా ఇదే జాబితాలోకి వస్తారు. కె.సత్యరాజ్ కెమెరామెన్, ఎన్.ఆర్.రఘునందన్ సంగీతం అందించారు. జయకృష్ణ మాట్లాడుతూ... "ఆలకాలం' అంటే ప్రాణాంతక విషం. మోసం, కుళ్ళు కుతంత్రాలు, మద్యం, డ్రగ్స్ అణిచివేత ఇలాంటివాటిలో ప్రపంచం చిక్కుకుని నలిగిపోతోంది. ఇలాంటి సమాజంలో ఆదర్శంగా పెంచుకున్న కుమారుడు, విజయ లక్ష్యం కోసం పోరాడే యువకుడు, ఆత్మవిశ్వాసంతో ప్రేమకోసం ఎదురు చూసే ప్రేయసి, జీవితాలను నాశనం చేయాలనే విలన్లు ఇలా అనేక సమస్యల మధ్య తల్లి ఆశయం, యువకుడి ప్రయత్నం, ప్రియురాలి ప్రేమ సఫలమైందా? లేదా? అన్నదే ఈ చిత్ర కథ. యాక్షన్ సెంటిమెంట్ చూసిన సెన్సార్ సభ్యులే మెచ్చుకున్నారు. కుటుంబం, తల్లి, భార్యాభర్తలకు అతీతంగా ఒక మంచి సామాజిక సందేశంతో కూడిన చిత్రాన్ని నిర్మించారంటూ ప్రశంసించారు... అని పేర్కొన్నారు.



'ఆలకాలం'లో జయకృష్ణ - చాందిని

## సంతానోత్పత్తి ఒత్తిడి సమస్యను వివరించేలా...

● త్వరలో 'వెప్పం కులిర్ మళై' విడుదల

చిత్రజ్యోతి

కొత్తగా వివాహమైన దంపతులు ఎదుర్కొంటున్న సంతానోత్పత్తి, మానసిక ఒత్తిడి సమస్యలకు పరిష్కార మార్గం చూపే చిత్రంగా 'వెప్పం కులిర్ మళై' తెరకెక్కింది. 'కుట్రం కడిదల్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టరుగా జాతీయ అవార్డును అందుకున్న పాస్కల్ వేదముత్తు ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా మారారు. నిర్మాత ధీరవ్ ఇందులో హీరోగా నటించడమే కాకుండా, నిర్మాతగా వ్యవహరించారు. ఇస్మత్ బాను హీరోయిన్. సీనియర్ నటుడు ఎం.ఎస్.భాస్కర్ ముఖ్య పాత్రను పోషించారు. బుధవారం జరిగిన సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ... 'బాహ్య, సామాజిక అంశాలు మానసిక, శారీరక అస్థిరతకు దారి తీస్తాయనే అంశాన్ని ప్రధానంగా చూపించాం. ఈ మూవీలో సింహభాగం మానవ సంబంధాలు, భావోద్వేగాలను అన్వేషించేలా సాగుతుంది. 'అసురన్' చిత్రంలో ఇస్మత్‌బాను ఒక పాటలో కనిపించినప్పటికీ ఆమె నటన ద్వారా ప్రేక్షకుల్లో గుర్తింపు పొందారు. సీనియర్ నటుడు ఎంఎస్ భాస్కర్ పాత్ర చాలా బాగా వచ్చింది. అత్తగారి పాత్రను నటి రమ పోషించారు' అని వివరించారు. ఎఫ్‌డీఎఫ్‌ఎస్ నిర్మాణ సంస్థ తెరకెక్కించిన ఈ సినిమాకు పృథ్వీరాజేంద్రన్ ఛాయాగ్రహణం అందించగా, సంగీతం శంకర్, రంగరాజన్. కాగా, ఈ మూవీ ట్రైలర్‌ను తాజాగా దర్శకుడు వెట్రిమారన్ విడుదల చేశారు.



'వెప్పం కులిర్ మళై' ధీరవ్, ఇస్మత్ బాను

## డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో 'హార్ట్‌బీట్' స్ట్రీమింగ్

హాస్పిటల్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన 'హార్ట్ బీట్' వెబ్‌సిరీస్ డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. హృదయాన్ని కదిలించేలా ఈ వినోదాత్మక సిరీస్‌ను తెరకెక్కించారు. శుక్రవారం నాలుగు ఎపిసోడ్లుగా స్ట్రీమింగ్ చేస్తున్నారు. ఆస్పత్రిలో డాక్టర్ రతి అనే వైద్యురాలు పనిచేస్తుంది. ఆమెకు జూనియర్‌గా రీనా అనే యువ డాక్టర్ విధుల్లో చేరుతారు. ఆ తర్వాత తానే రతి కుమార్తెనని రీనా తెలుసుకుని, అసలు నిజాన్ని బహిర్గతం చేస్తుంది. తాను జన్మించిన వెంటనే పెంచి పెద్ద చేయకుండా ఎందుకు అనాథగా వదిలేసింది? చివరకు రీనాను రతి తన బిడ్డగా అంగీకరించిందా? లేదా? వంటి అనేక ట్విస్ట్‌లతో రూపొందించారు. అనుమోల్, దీపా బాలు, యోగలక్ష్మి, రామ్, శబరేష్, శర్వా, జయరావు, గిరి ద్వారకేష్ తదితరులు నటించారు. దీపక్ సౌందర్ రాజన్ దర్శకత్వం వహించిన ఈ వెబ్‌సిరీస్‌ను టెబీ ఫ్యాక్టరీ నిర్మించింది.



'హార్ట్‌బీట్'లో ఓ దృశ్యం